క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



బొల్లాపల్లి: త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని మేళ్లవాగు, పమిడిపాడు గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని గురు శిష్య సంబంధం గురించి ప్రచారం నిర్వహించామని పిడుగురాళ్ల కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు తెలిపారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల సారాంశం గ్రహించడం వల్ల మధ్యాత్మ ఆరాధనతో ధర్మాల స్థాపన జరుగుతుందనేది త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. త్రిమత గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన అధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను, ప్రతులను గ్రామాల్లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

30న కార్పెంటర్స్ యూనియన్ ఎన్నిక



వినుకొండ(నూజెండ్ల): స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వినుకొండ కార్పెంటర్స్ యూనియన్ సన్నాహక సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.మనుమంతరెడ్డి యూనియన్ ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ నెల 30న యూనియన్ నాయకులను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వినుకొండ టౌన్ గౌరవాధ్యక్షుడు బొంకూరి వెంకటేశ్వర్లు, అంగలకుదురు ఆంజనేయులు, సిద్ది వెంకటరావు, చోడవరపు జగదీష్, కంచర్ల సుబ్రమణ్యం, పప్పూరి వెంకటప్పయ్య, భూషణం, గోవిందరాజులు పాల్గొన్నారు.

డాక్టరు శ్యాం ప్రసాద్ ముఖర్జీ సేవలు అభినందనీయం



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో జన సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టరు శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. శ్యాం ప్రసాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘన నివాళులర్పించారు. బీజేపీ నాయకులు గట్టుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టరు ముఖర్జీ తన జీవితం భారతదేశ ఐక్యత ప్రగతి కోసం అంకితం చేశారన్నారు. 370 ఆర్టికల్ రద్దుపై ఎన్నో ఉద్యమాలు చేసిన గొప్ప మహనీయుడన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేడం రమేష్, అన్నవరపు శ్రీనివాసరావు, కాకుమాను నాగేశ్వరరావు, సూరాబత్తిని సుబ్బారావు, పోకా శ్రీనివాసరావు, మారిశెట్టి మహేష్, రావి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

క్రోసూరు: వివాహితతో అసభ్యంగా ప్రవర్తించాడన్న ఫిర్యాదుతో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.షఫీ ఆదివారం తెలిపారు. మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన వివాహిత తన ఇంటి ముందు కూరగాయలు అమ్ముకుంటూ జీవిస్తుంటుంది. ఈ క్రమంలో ఈ నెల 21వ తేదీన అక్కడే నివసిస్తున్న శిరసాని రమేష్‌బాబు వివాహితతో అసభ్యంగా ప్రవర్తించాడని, చంపుతానని బెదిరించాడని బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాలఘర్షణ





క్షతగాత్రులు సాగర్, నరేంద్ర

సత్తెనపల్లి: పాత కక్షల నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగిన ఘటన పట్టణంలోని 21వ వార్డులో ఆదివారం జరిగింది. ఈ ఘర్షణలో ఒక వర్గానికి చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులైన పి.నరేంద్ర, కాకాని సాగర్, పి.పోలమ్మలను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

దండన వద్దు.. మృదువైన భాషే ముద్దు

జూన్ నెల వచ్చిందంటే చాలు.. తల్లిదండ్రుల్లో హైరానా.. బడిగంట మోగగానే కొందరు చిన్నారులు కేరింతలు కొడితే.. మరికొందరు ఏడుపు మొహాలు వేస్తారు. బుడి బుడి అడుగులు వేసే చిన్నారులను తల్లిదండ్రులు ఉత్సాహంగా బడిలో వేస్తారు. చిన్న పలక, అందమైన యూనిఫామ్ ధరించి, అడుగులో అడుగు వేసుకుని బుజ్జాయి బడికి వెళ్తుంటే తల్లిదండ్రులు మురిసిపోతారు. వారి ఆనందానికి అవధులే ఉండవు. అయితే కొందరు పిల్లల విషయంలో మాత్రం తిప్పలు తప్పవు. బడి పేరెత్తితే చాలు.. వెన్నులో వణుకు మొదలవుతుంది.. కన్నీరు ఆగకుండా వచ్చేస్తుంది. ఇలాంటి చిన్నారులను బడికి పంపడం తల్లిదండ్రులకు కత్తి మీద సామే.



- చిన్నారుల్లో వెంటాడుతున్న స్కూల్ ఫోబియా
- పసి మనసులను సులభంగా మార్చవచ్చు
- తల్లిదండ్రులూ.. మీరే కీలకం

సత్తెనపల్లి: పిల్లలకు ఐదారు సంవత్సరాల వయసు వచ్చే వరకు గతంలో పాఠశాలకు పంపే వారు కాదు. బాల్యం హాయిగా ఇంట్లోనే పెద్దల మధ్య గడిచిపోయేది. కాలం మారిపోయింది. ఉమ్మడి కుటుంబం సంస్కృతి చాలా వరకు పోయింది. చిన్న చిన్న కుటుంబాల సంస్కృతి పెరిగింది. తల్లిదండ్రులు పిల్లలను వీలైనంత తక్కువ వయసులో పాఠశాలకు పంపడానికి ఇష్టపడుతున్నారు. ఇంటి దగ్గర ఉంటే అల్లరి చేస్తారని, బడికి పంపితే మంచి అలవాట్లు అలవాడతాయని మూడేళ్ల పిల్లలను సైతం బడిలో చేర్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతం మొదలు పట్టణాల వరకు ఇదే పరిస్థితి. మూడు సంవత్సరాలు నిండితే చాలు పిల్లలు స్కూల్లో కనిపిస్తున్నారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ అంటూ చిన్నారులకు పాఠాలు మొదలవుతున్నాయి. ఎంతో డబ్బు పోసి పిల్లలను పాఠశాలకు పంపితే వారు వెళ్లకుండా మారాం చేయడం వెనక ఉన్న కారణాలను గుర్తించాలి.

తల్లిదండ్రులే కీలకం...

- చిన్నారుల్లో భయాన్ని పోగొట్టడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం. కారణాలు ఏమైనా స్కూలుకు వెళ్లమని పేచీ పెట్టే పిల్లలకు సరైన మార్గంలో నచ్చచెప్పాలి. ఇష్టానుసారంగా కొట్టడం సరైన పద్ధతి కాదు.
- కొట్టడంతో పాటు తిట్టడం, భయపెట్టడం వంటి పనులు చేయకూడదు. బలవంతంగా పాఠశాలకు పంపడం వల్ల పాఠశాల అంటే వారిలో వ్యతిరేక భావన ఏర్పడే అవకాశం ఉంటుంది.
- స్కూల్లో చేర్పిన కొత్తలో తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు స్కూల్లో దింపి, పాఠశాల పూర్తి కాగానే తీసుకురావడం చేయడం వల్ల పిల్లల్లో మనోస్థైర్యం ఏర్పడుతుంది.

ఉపాధ్యాయుల పాత్ర అవసరమే...

- తల్లిదండ్రుల సంరక్షణ నుంచి స్కూలుకు వెళ్లగానే ఉపాధ్యాయుల వ్యవహార శైలి పిల్లల్ని ఎంతగానో ప్రభావితం చేస్తుంది. ఇది భవిష్యత్తులోనూ వారిపై ప్రభావితం చూపుతుంది. అందుకే పిల్లల విషయంలో ఉపాధ్యాయుల పాత్ర కూడా ఎంతో కీలకం.
- పిల్లల్లో స్కూల్ ఫోబియాను పోగొట్టాలంటే ఉపాధ్యాయుల సహాయం ఎంతో అవసరం. పిల్లలు ఉపాధ్యాయులను చూడగానే భయపడాలనే భావనతో ఉండకూడదు. సన్నిహితంగా, స్నేహపూర్వకంగా మెలగాలి. ఒక స్నేహితుడు మాదిరిగా మాట్లాడి దగ్గరకు తీసుకోవాలి.
- పిల్లల మనసులో ఉపాధ్యాయులు కొడతారనే భావన తొలగించే ప్రయత్నం చేయాలి. 'మా టీచర్ చక్కటి కథలు చెబుతారు.. ఆటలు ఆడిస్తారు.. మాతోనే ఉంటారు' అని పిల్లలు చెప్పాలి. చాలా మంచి వారు అని చెప్పారంటే వారు తప్పకుండా పిల్లల విషయంలో విజయం సాధించినట్లే.
- ఉపాధ్యాయుల ప్రవర్తన పిల్లలకు ఇబ్బంది కలగకుండా ఉండాలి. ముఖ్యంగా వారి వస్త్రధారణ, మాట తీరు, ప్రవర్తన, ఇతరులతో కలివిడిగా ఉండే గుణం ఇలా అన్ని విషయాలు చిన్నారుల్ని ప్రభావితం చేస్తాయి.
- స్కూలుకు రెగ్యులర్‌గా రావడం వల్ల వచ్చే ప్రయోజనం గురించి ఉపాధ్యాయులు చెప్పాలి. చిన్నప్పుడే గొప్ప వారి జీవిత చరిత్రలను చెబితే వారి జీవితాంతం గుర్తుంటాయి. ఓ మంచి లక్ష్యం ఏర్పడటానికి దోహదం చేస్తాయి.

పాఠశాల ఫోబియానే...

సాధారణంగా పిల్లలు పాఠశాల అంటే భయపడటాన్ని సైన్స్ పరిభాషలో 'స్కూల్ ఫోబియా' అంటారు. ఇది ఉన్న పిల్లల్లో బడి గేటు దగ్గరకు రాగానే బిగ్గరగా ఏడవడం, వాంతులు చేసుకోవడం, తలనొప్పి, కళ్లు తిరగడం, కడుపునొప్పి వంటి అనారోగ్య లక్షణాలు కనబడుతుంటాయి. తల్లిదండ్రులు ఏదో నటిస్తున్నారు అనుకోకుండా వారిని జాగ్రత్తగా చూడాలి. బడి అంటే భయపడే పిల్లలను బలవంతంగా పంపడం సరికాదు. వారి భయానికి కారణాన్ని కనుగొని దాన్ని తొలగించి పంపడం మంచిది. దాదాపు నూటికి 90 శాతం మంది పిల్లలు స్కూలుకు ఎలాంటి పేచీ పెట్టకుండా వెళతారు. మిగిలిన 10 శాతం మంది పిల్లలతోనే సమస్య. వీరు స్కూల్ అంటేనే భయపడిపోతుంటారు. బడికి వెళ్లమని గొడవ చేస్తుంటారు.

కారణాలు అనేకం...

పిల్లలు పాఠశాలకు వెళ్లనని చెప్పడం వెనక ఎన్నో కారణాలు ఉంటాయి. వీటిని మనస్తత్వ శాస్త్రవేత్తలు కొన్ని రకాలుగా విశ్లేషిస్తారు.

- చిన్ననాటి నుంచి అల్లారుముద్దుగా పెంచడం
- తల్లిదండ్రులను అంటిపెట్టుకుని ఉండడం, ఏక సంతానం కావడం
- ఇంటిని, తల్లిదండ్రులను విడిచి ఉండలేకపోవడం, అలవాటైన గృహ వాతావరణం
- పాఠశాల వాతావరణం నచ్చకపోవడం, ఉపాధ్యాయుల ప్రవర్తన సక్రమంగా లేకపోవడం
- తల్లిదండ్రులు పిల్లలు అల్లరి చేసినా, గొడవ చేసినా స్కూలుకు పంపిస్తాను.. అంటూ భయపెట్టడం
- ఇతర పిల్లల ప్రవర్తన సరిగా లేకపోవడం

భయంతోనే వారికి ఆ లక్షణాలు వస్తాయి



అప్పటి వరకు ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారడంతో కొంత మంది చిన్న పిల్లలకు స్కూలు అనగానే భయమేస్తుంది. స్కూల్ ఫోబియాతో పిల్లలకు లేనిపోని వ్యాధి లక్షణాలు వస్తుంటాయి. వాంతులు చేసుకోవడం, కడుపులో నొప్పి అంటూ పిల్లలు చెబుతుంటారు. వారిని ఆ ఫోబియా నుంచి బయటకు తీసుకురావాలి. ప్రత్యేక వాతావరణం కల్పిస్తే ఫోబియా నుంచి బయటపడతారు. ఒకసారి ఫోబియా నుంచి పిల్లలు బయటకు వస్తే మరలా ఇలాంటి సమస్య ఉత్పన్నం కాదు.

–డాక్టర్ బి.లక్ష్మణరావు, చిన్నపిల్లల వైద్య నిపుణులు, సత్తెనపల్లి

నేడు కౌలు రైతు గుర్తింపు గ్రామ సభలు

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలు, చందవరం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం కౌలు రైతు గుర్తింపు కార్డులపై గ్రామ సభలు నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ గొరిజవోలు, సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకూ చందవరం గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయన్నారు. కౌలు రైతులు తమ ఆధార్ కార్డు, సంబంధిత పత్రాలను తీసుకొచ్చి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఘనంగా పోలేరమ్మ కొలుపులు

శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామంలో పోలేరమ్మ కొలుపులు ఈ నెల 19 నుంచి గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం చివరిరోజు ముగింపు వేడుకల్లో గ్రామస్తులు ఐక్యంగా అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ దేవాలయం విద్యుద్దీపాలతో వెలిగిపోయింది.

నియోజకవర్గ అభివృద్ధికి అండగా నిలవండి



నరసరావుపేట: నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందజేసి ముందుకు నడిపించాలని ఐటీ, కమ్యూనికేషన్స్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. ఆదివారం ఉండవల్లిలోని నివాసంలో లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను వివరించారు. తాగునీరు, రోడ్లు ఇతర సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని మంత్రిని కోరారు.

వైభవంగా సుదర్శన హోమం



లక్ష్మీనరసింహస్వామి



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దంపతులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొండమెట్ల వద్ద ఉన్న అతి పురాతనమైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం స్వామివారికి పంచామృత అభిషేకం, సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు పీటలపై కూర్చొని యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకుడు నాగశ్రీను రాయల్, బీజేపీ నాయకులు లెనిన్ కుమార్, పోట్లూరి సైదారావు, నలబోతుల రామకోటేశ్వరరావు, మోటమర్రి నరసింహారావు, పువ్వాడ కృష్ణ, సనిశెట్టి లక్ష్మీనారాయణ, కాళింగరాజు, శ్రీనివాసరావు, ఆలయ సేవకులు జాజుల మాల్యాద్రి తదితరుల పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్సై బలరామ్‌రెడ్డి

నాదెండ్ల: గ్రామాల్లో రాజకీయ కక్షలు, కార్పణ్యాలు లేకుండా ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని చిలకలూరిపేట రూరల్ సీఐ కె.శ్రీనివాసరెడ్డి కోరారు. మండల కేంద్రమైన నాదెండ్ల ఉరవకట్ట సెంటర్ గాంధీ విగ్రహం వద్ద ఆదివారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ముగిసినందున రాజకీయ చర్చలు, కార్యకలాపాలకు స్వస్తి పలకాలని కోరారు. నూతన ప్రభుత్వం ఏర్పడినందున ప్రతి ఒక్కరూ తమ పనుల్లో నిమగ్నమై ప్రశాంతంగా ఉండాలన్నారు. అనవసర ఉద్రేకాలు, ఘర్షణలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కోవద్దని హితవు పలికారు. గొడవలు, విధ్వంసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ధ్వంసం చేసి జైళ్ల పాలు కావద్దని హెచ్చరించారు. ఎవరైనా ఉద్రేకాలను రెచ్చగొట్టినా, గొడవలకు ఉసిగొల్పినా తమకు సమాచారమివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జె.బలరామ్‌రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ విద్యకు శావల్యాపురం పాఠశాల ఎంపిక



శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్ (కేంద్రీయ సెకండరీ విద్య) ద్వారా బోధన చేయనున్నట్లు ప్రధానోపాధ్యాయని బొడ్డపాటి విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. మొదటి విడతలో మండలం నుంచి శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను సీబీఎస్ బోధనకు ఎంపిక చేసినట్లు ఆమె వెల్లడించారు. విద్యార్థుల ఆలోచన ధోరణిలో మార్పు, నూతన సమస్యలకు పరిష్కారం, సెల్ఫ్ డెవలప్‌మెంట్ స్కిల్స్, విషయ పరిజ్ఞానం, జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధమవ్వడానికి కేంద్రి విద్యా విధానం దోహదపడుతుందన్నారు. ఈ ఏడాదిలో పదో తరగతిలో వంద మంది విద్యార్థులు సీబీఎస్ విద్యకు అర్హత సాధించినట్లు తెలిపారు. అయితే ఇతర పాఠశాలల నుంచి జనరల్ సిలబస్ విద్యార్థులు ఇక్కడ పదో తరగతిలో చేరాలంటే అనుమతి లేదని హెచ్ఎం స్పష్టం చేశారు. నూతనంగా పదో తరగతిలో చేరాలనుకునే విద్యార్థులకు కూడా సీబీఎస్ఈ అకాశం కల్పించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

సీసీఆర్ కార్డుతో కౌలు రైతులకు మేలు

రెంటచింతల: ప్రభుత్వం అందిస్తున్న రుణ అర్హత (సీసీఆర్సీ) కార్డును కౌలు రైతులు తీసుకోవడం వలన ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులపై కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. రుణ అర్హత కార్డును కౌలు రైతులు తీసుకోవడం ద్వారా ఈ–పంట నమోదు చేసుకోవచ్చని, రైతులకు ఇన్సురెన్స్ ఉంటుందని, పంటను అమ్ముకొనుటకు, బ్యాంక్ రుణాలు తీసుకోవడానికి, వివిధ ప్రభుత్వ పథకాలు పొందుటకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతికూల వాతావరణం వలన పంటలు నష్టపోయిన సమయంలో కౌలు రైతులకు ఈ రుణ అర్హత కార్డుల వలన నష్టపరిహారం అందుతుందన్నారు. సీసీఆర్సీ కార్డులపై భూ యజమానులకు, కౌలు రైతులకు అవగాహన కల్పించి వెంటనే కార్డులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి కౌలు రైతులు సీసీఆర్సీ కార్డు పొందవచ్చన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పరిశుభ్రమైన నీటిని మాత్రమే తాగాలి

అమరావతి: మండల పరిధిలోని గ్రామాల ప్రజలు స్వచ్ఛమైన తాగునీటిని తీసకోవడంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కలుషితమైన తాగునీటి వల్ల విషజ్వరాల బారిన పడటమే కాకుండా డయేరియా సోకే ప్రమాదముందన్నారు. మండలంలో అన్ని గ్రామ పంచాయతీలకు ఏఎన్ఎం ద్వారా ఆరోగ్య శాఖ సూచనలు వివరించామన్నారు. గ్రామాల్లో కుంటలలో నిల్వ ఉన్న నీటి వల్ల దోమలు చేరటంతో టైఫాయిడ్, మలేరియా వంటి జ్వరాలు వ్యాపిస్తాయన్నారు. రాష్ట్రంలో పలు ప్రాంతాలలో పారిశుద్ధ్య లోపం, తాగునీరు కలుషితమవటంతో డయేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. ఇప్పటివరకు మండలంలో ఒక్క డయేరియా కేసు నమోదు కాలేదన్నారు. కాచి వడపోసిన నీటిని తాగాలన్నారు. ప్రతి గ్రామంలోను పరిస్థితిని సమీక్షించి అవసరమైన చోట మెడికల్ క్యాంపులు, రక్త పరీక్షలు, పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

సత్తెనపల్లి టు గోవా

సత్తెనపల్లి: గోవా టూర్‌కు సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ ఆదివారం తెలిపారు. గోవా టూర్ వెళ్లేందుకు సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 25న రాత్రి 8:00 గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు బయలు దేరుతుందన్నారు. గోవా నుంచి తిరిగి ఈ నెల 29న సాయంత్రం బయలుదేరి జూలై 2న ఉదయం సత్తెనపల్లి వస్తుందన్నారు. టికెట్ ధర రాను, పోను ఒక్కొక్కరికి భోజనంతో కలిపి రూ.7,500గా నిర్ణయించామన్నారు. గోవా టూర్‌కు వెళ్లాలనుకునే యాత్రికులు ఈ అవకాశం సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు.

ల్యాప్‌టాప్ అందజేత

సత్తెనపల్లి: మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ మాగులూరి భానుప్రకాశ్ సహకారంతో రఘురామ్ నగర్‌కు చెందిన కొట్టారు శ్రీలక్ష్మీకి ఆదివారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ల్యాప్‌టాప్ అందించారు. ఉద్యోగ అవసరాల నిమిత్తం విద్యార్థినికి అందజేసినట్లు తెలిపారు. శ్రీనివాసరావు, కిరణ్, సుబ్బారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బాలికల జూనియర్ కళాశాలకు అనూహ్య స్పందన



అడ్మిషన్ పత్రం అందజేస్తున్న అధ్యాపకులు

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని బాలికల జూనియర్ కళాశాలకు అనూహ్య స్పందన లభిస్తోందని కళాశాల అధ్యాపకుడు కుమ్మరి శ్రీనివాసరాజు ఆదివారం తెలిపారు. గతేడాది కళాశాల ఏర్పాటుకు అనుమతులు వచ్చాయని, గత విద్యా సంవత్సరం పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంతో ఉపాధ్యాయుల కృషి ఫలించిందన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన వస్తోందని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో 25 మంది, బైపీసీలో ఐదుగురు విద్యార్థినులు అడ్మిషన్లు పొందినట్లు వెల్లడించారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో 18, బైపీసీలో 12 మంది బాలికలు విద్యనభ్యశిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరంగా ఏలాంటి ఫీజులు లేవని, ప్రత్యేకంగా ఏడుగురు అధ్యాపకులు మెరుగైన బోధన అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో విస్తతంగా పర్యటిస్తూ.. కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేస్తున్నామన్నారు. వివరాలకు 86399 87471 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌కు చికిత్స



మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు




వైద్య పరీక్షల బస్సు వద్ద రోటరీ సభ్యులు

చిలకలూరిపేట: క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా సమర్థంగా చికిత్స అందించవచ్చని ప్రముఖ అంకాలజిస్టు డాక్టర్ ముఖేష్ తెలిపారు. వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలు వద్ద ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరాన్ని ధనలక్ష్మి గ్రూపు ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ పేర్ని వీరనారాయణ, వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్ చైర్మన్ తోటకూర సీతారావమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముఖేష్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని తొలి దశలో గుర్తించలేని పక్షంలో పరిస్థితి ప్రమాదకరంగా మారుతుందని హెచ్చరించారు. 40 సంవత్సరాలు దాటిన వారు తప్పనిసరిగా ప్రతి ఏడాది క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్ ఎక్కువగా సోకుతున్నట్లు వివరించారు.

రొమ్ములో గడ్డ, సొట్టలు, అణగారిన చర్మం, రొమ్ము నుంచి రక్తం కారడం, వాయడం వంటివి క్యాన్సర్ లక్షణాలని చెప్పారు. కాళ్లు నొప్పి, పొత్తికడుపు నొప్పి తరుచుగా అలసట, నెలసరి తర్వాత రక్తస్రావం వంటివి గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ లక్షణాలని వివరించారు. నోటి లోపల, చిగుళ్ల లోపల గడ్డలు, వాపులు, పెదవులపై మచ్చలు, అకస్మాత్తుగా నోటి నుంచి రక్తస్రావం, తాగేటప్పుడు, మింగేటప్పుడు నొప్పి, అకస్మాత్తుగా దంతాలు వదులవ్వడం, బరువు తగ్గడం, నోటి లోపల పెరుగుతున్న గడ్డ వంటివి నోటి క్యాన్సర్ లక్షణాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుమారు 100 మందికి క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఐదుగురిని అనుమానితులుగా గుర్తించారు. వారి స్కానింగ్ రిపోర్టులు వచ్చాక.. రోటరీ ఫౌండేషన్ తరుపున ఉచితంగా వైద్యాన్ని అందిస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కాపు వెంకటరావు, కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, సభ్యులు తోటకూర వెంకటనారాయణ, గల్లా సాంబశివరావు, జాష్టి రంగారావు, మొహమ్మద్ యూసుఫ్ అలి, ముక్తార్ అహమ్మద్, హైదరాబాద్ మల్లారెడ్డి ఆసుపత్రికి చెందిన వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



యడ్లపాడు: ఆహార నియమాలను క్రమబద్ధీకరించుకోవడంతోనే షుగర్, బీపీని అదుపులో ఉంచుకోవచ్చని ప్రముఖ వైద్యులు లింగమల్లి భాస్కర్ మోహన్ తెలిపారు. స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం బీపీ, షుగర్ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో వైద్యులు లింగమల్లు భాస్కర్ మోహన్, జూనియర్ డాక్టర్ నేలటూరి రాజేశ్వరి పాల్గొన్నారు. 220 మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వారికి రెండు నెలలకు సరిపడా మందులను పంపిణీ చేశారు. యడ్లపాడు అభివృద్ధి కమిటీ సభ్యుల్లు కిరణ్, వేణుగోపాల్, కేతా రామబ్రహ్మం, పోపూరి శ్రీనివాస రావు, బచ్చు రాజేష్‌కుమార్, అరె వంశీ, పోపూరి ఆర్తి, పీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు నూతలపాటి కాళిదాసు, విజన్ ఫౌండేషన్ సభ్యులు రావూరి సుమన్, సీహెచ్ రంగారావు, కోయ రామోజీరావు, రావూరి సురేష్ పాల్గొన్నారు.